


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

వైఎస్ఆర్ కడప

సోమవారం 06 అక్టోబర్ 2025

పేజీలు - 08


# రబీపంట సాగుపైనే ఆశలు



## శనగ సాగుకు సన్నద్ధం

## ఎరువులు విత్తుకుంటున్న రైతులు

విస్తారంగా నల్ల రేగడి భూములు ఉన్న ఈ ప్రాంతంలో శనగ పంట సాగుకు ప్రాధాన్యత ఇస్తారు ఇప్పటికే రైతులు బీడు భూముల్లో ఎరువులు విత్తుకొనే పనిలో నిమగ్నమై ఉన్నారు ఇప్పటికే ఆ పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి నాణ్యమైన శనగ విత్తనాలను కొనుగోలు చేసే పనిలో రైతులు ఉన్నారు తుఫాన్లు వర్షాలు తగుముఖం పట్టాక శనగ పంట సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

**రాజుపాళెం, మేజర్‌న్యూస్:**

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో శనగ పంట విస్తారంగా సాగు చేసే మండలాల్లో పెద్దముడియం మండలం తర్వాత రెండో స్థానంలో రాజుపాళెం మండలం నిలుస్తుంది. గత ఏడాది రబీలో వ్యవసాయ అధికారుల పంట నమోదు మేరకు 22302 వేల ఎకరాల్లో శనగ పంట సాగు అయింది ఈ ఏడాది రబీ అదే విస్తీర్ణంలో శనగ పంట సాగు అయ్యేఅవకాశాలు కనిపిస్తున్నాయి. పకృతి కరుణిస్తే ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు శనగ పంటలో దిగుబడులు సాధించవచ్చు నని ఇక్కడి రైతులు ఎక్కువగా జెజె-11 రకం ఎర్ర శనగలు ఎక్కువగా సాగు చేస్తారు. చాలామంది రైతులు తెల్ల శనగల పంటను పండిస్తారు మండలంలో చిన్న శెట్టి పల్లె పొట్టిపాడు పర్లపాడు కుమ్మర పల్లె గోపాయపల్లె తదితర గ్రామాల్లో విస్తారంగా శనగ పంట సాగు అవుతూ వస్తోంది మంచి పదునైన వానకు విత్తనాలు విత్తిన తర్వాత నెలలోపు ఓ మాదిరి వర్షం కురిస్తే రైతులకు అనుకున్న మేర శనగ పంటలో దిగుబడులను సాధిస్తారు. కొన్ని గ్రామాల్లో శనగ పంట తప్ప ఇతర ఏ పంటలు సాగు చేయరు. సరైన వర్షాలు లేక ఖరీఫ్‌లో తక్కువ విస్తీర్ణంలో పంటలు సాగైనప్పటికీ రబీ పంటల సాగు వైపే రైతులు ఆసక్తి చూపుతున్నారు ఇప్పటికే ఎక్కువ విస్తీర్ణంలో మినుము పంట సాగు చేశారు ఈఏడాది రబీలో సాగయ్యే శనగ పంట పైనే చాలామంది రైతులు ఆశలు పెట్టుకుని ఉన్నారు. రబీలో శనగ పంట పండిస్తే అధిక దిగుబడి వస్తుందని రైతులు ఎంతో ఆశగా ఉన్నారు. రబీలో పండించిన శనగ పంటకు అధిక దిగుబడితో పాటు ధర కూడా ఉంటుందని తమ జీవితాల్లో ఆనందం నిలుస్తుందని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

## చుట్టూ చెత్త, మురుగు నీరు..

# పారిశుద్ధ్యం మెరుగుపడేనా...



**చింతకొమ్మదిన్నె మేజర్‌న్యూస్ :** చింతకొమ్మదిన్నె మండలంలోని ఆజాద్‌నగర్‌లో ప్రజలు తీవ్ర సమస్యలతో తల్లడిల్లుతున్నారు. ఊరంతా చెత్త, మురుగు నీటితో నిండిపోవడం వల్ల అసౌకర్యాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. గ్రామంలో చెత్త బండ్లు రావడం లేదన్న కారణంగా ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం అలవాటయ్యింది. దీనివల్ల కాలనీల చుట్టూ చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్వాసనతో జనజీవనం తల్లకిందలవుతోంది. ఈ నేపథ్యంలో "ఇక్కడ చెత్త వేయరాదు - వేసినచో జరిమానా విధించబడును" అని గ్రామ కార్యదర్శి బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ, అధికారులు దీనిపై ఎలాంటి

## ప్రొద్దుటూరులో తల్లిని

# హత్య చేసిన కొడుకు



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలోని శ్రీరామ్ నగర్ లో ఆదివారం తల్లిని కొడుకు హత్య చేసిన ఘటన చోటు చేసుకుంది. ఈ విషయమై త్రీ టౌన్ పోలీసుల కథనం మేరకు... శ్రీరామనగర్‌కు చెందిన లక్ష్మీదేవి (50) ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నదని, ఆమె కుమారుడు యశ్వంత్ కుమార్ రెడ్డి చెన్నైలో బిటెక్ పూర్తి చేశాడని తెలిపారు. గత 2 సంవత్సరాలుగా జాబ్ సెర్చ్ చేస్తున్న తరుణంలో యశ్వంత్ డబ్బులు అడిగితే తల్లి పదే పదే వాయిదా వేస్తోందని, ఇంటికి రమ్మని చెబుతున్న నేపథ్యంలో హైదరాబాద్ లోనే హత్యకు పథకం రూపొందించి, కత్తి కూడా కొనుగోలు చేసి వచ్చాడని వివరించారు. ఆదివారం ఉదయం ప్రొద్దుటూరు చేరుకున్న యశ్వంత్ తల్లిని కత్తితో గొంతు కోసి హత్య చేశాడని తెలిపారు. ఘటనపై మృతురాలి తల్లి, హతుడి తండ్రి విజయభాస్కర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు

# దూరంగా ఉండండి



### జిల్లాలో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ చేసిన పోలీస్ అధికారులు

**కడప క్రైమ్ మేజర్ న్యూస్:**

కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , వ్యసనాల బారిన పడి చెడు చెడు అలవాట్లకు బానిసైన వ్యక్తులకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. మంచి దారిలో జీవితాన్ని గడపాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు వారికి తెలిపారు.

## నకిలీ మద్యం కేసులో అసలు నేరస్థులెవరో తెలపాలి



8లో

## ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లమో, ఎంబీఏ, ఫార్మశీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన సాయంత్రం 4గంటలకు స్థానిక ఇస్కాన్ కేంద్రంలో విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు ఇస్కాన్ ప్రతినిధులు వసుమనా వెంకటేష్ దాస్ తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం, నైతిక విలువలు, ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఇస్కాన్. దామోదర లీల అనే అంశాలపై వ్యాసరచన పోటీలు ఉంటాయని, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లమో, ఎంబీఏ, ఫార్మశీ విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈ నెల 21న దీపావళి పండుగ రోజున పోటీల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.50000. ద్వితీయ బహుమతిగా రూ.25000. తృతీయ బహుమతిగా రూ.10వేలుతో పాటు 20 ప్రోత్సాహక బహుమతులు అందచేస్తామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు 9542863866 నంబరుకు సంప్రదించాలని కోరారు. సమావేశంలో ఇస్కాన్ ప్రతినిధులు యశ్వంత్. వైకుంఠ ఈశ్వర్దాస్ పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం



**పోరుమామిళ్ల, మేజర్ న్యూస్:** పోరుమామిళ్ల పట్టణానికి చెందిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు ఖాసీం వల్లిని ఆదివారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సంస్కృతి స్వచ్ఛంద సంస్థ అవార్డు టీచర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల నందు ఏర్పాటుచేసిన ఉత్తమ ఉపాధ్యాయుల అభినందన సభలో పూలమాల, శాలువతో సన్మానించి మొమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో వై.వి.యూ సబ్ రిజిస్ట్రార్ ఆచార్య పద్మ లత, అవార్డి టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె. ఎల్.వి రమణయ్య, సంస్కృతి స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బండి. పరిమళ జ్యోతి,జిల్లా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చుట్టూ చెత్త, మురుగు నీరు పారిశుధ్యం మెరుగుపడేనా..!

(మొదటి పేజీ తరువాయి)



స్పందన చూపటం లేదు. “బోర్డు పెట్టారు, కానీ చెత్త వేయడానికి ప్రత్యామ్నాయం చూపించలేదు ” అని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు చెత్త పేరుకుపోయిన ప్రాంతాల్లో మురుగు నీరు నిలిచిపోవడం వల్ల దోమల ఎక్కువ అవ్వడంతో ఆరోగ్య సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులు దోమల వల్ల విపరీతంగా ఇబ్బంది పడుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. అధికారులు గ్రామ సచివాలయంలో కూర్చునేంతవరకే పరిమితం. గ్రామంలో అసలు పరిస్థితి ఎలా ఉందో చూసే పరిస్థితి లేదు అంటూ ప్రజలు వాపోతున్నారు. వెంటనే చెత్త బండ్ల ఏర్పాటుతో పాటు మురుగు నీటి నిల్వ నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

## పిల్లలకు చదువుతో పాటు మంచి క్రమ శిక్షణతో కూడిన విలువలు నేర్పించాలి



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** పిల్లలకు చదువుతో పాటు మంచి క్రమ శిక్షణతో కూడిన విలువలు నేర్పించాలని ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సూచించారు. ఆదివారం కడప జిల్లా గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం (క్రుష్మా) ఆధ్వర్యంలో మండలంలోని దొరసాని పల్లెలో వున్న గోపికృష్ణ సెంట్రల్ స్కూల్ నందు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేసే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరికీ అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులందరూ పిల్లలకు చదువుతో పాటు మంచి క్రమ శిక్షణతో కూడిన విలువలు నేర్పించాలని వివరించారు. ఈ కార్యక్రమానికి పట్టభద్రుల శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. విద్యారంగ అభివృద్ధిలో ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలలు కూడా సమాన పాత్ర పోషిస్తున్నాయని, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు కూడా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేయడం చాలా మంచి కార్యక్రమం అని ఆయన అన్నారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని ఆయన అన్నారు. విద్యా వ్యవస్థ లో త్వరలో సమూల మార్పులు రానున్నాయని, సిలబస్ మారనుందని, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వంటి వారి చరిత్రను కూడా పాఠ్యాంశాలలో చేర్చనున్నారని వివరించారు. ప్రవేట్ ఉపాధ్యాయులకు అవార్డులు ఇవ్వటం ఆనందకరమని తెలిపారు. ప్రవేట్ పాఠశాలలు ఏర్పాటు చేయడం వలన పలువురికి ఉపాధి లభిస్తోందని తెలిపారు. అనంతరం ఉమ్మడి కడప జిల్లా నలుమూలల నుండి వచ్చిన 150 మంది ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి జి. రాజగోపాల్ రెడ్డి, ఎంఈఓ సావిత్రమ్మ, సంఘం వ్యవస్థాపకులు ఎన్. సోమశేఖర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు బి.ఎస్. రమణారెడ్డి, కార్యదర్శి బి. బాలసుబ్బారెడ్డి, కోశాధికారి ఏ. ఆంజనేయులు, గౌరవాధ్యక్షులు ఎం. అశోక్ రెడ్డి, జి. మాధవరెడ్డి, ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షులు బి. రాజారావు,గోపి కృష్ణ స్కూల్ డైరెక్టర్ కే. ప్రదీప్ రెడ్డి, పట్టణ కార్యదర్శి వి. శివశంకర్ రెడ్డి, కోశాధికారి డి. మనోహర్ రెడ్డి జిల్లా నలుమూలల నుండి వచ్చిన కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బంధువుల్లా అంత్యక్రియలు చేసిన మేఐహెల్ప్‌యు ఫౌండేషన్ సభ్యులు



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ నందు గుర్తుతెలియని వ్యక్తి నీటిలో పడి మరణించగా మృతదేహాన్ని మార్చురీ నందు ఉంచగా అంతిమ సంస్కరణలు చేయడానికి ఐదు రోజులు గడిచినా బందువులు ఎవరు రాకపోవడంతో హాస్పిటల్ సిబ్బంది ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్ ను సంప్రదించగా వారు వెంటనే స్పందించి ఆదివారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృప ఆగ్ని షారూన్ ట్రస్ట్ సభ్యులు పాపిషెట్టి వెంకటలక్షుమ్మ, సుమన్ బాబు, ప్రసన్న కుమార్, మైఖేల్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## స్వలాభం కోసమే పోలీసులను మెచ్చుకున్న ప్రవీణ్

### పట్టణ వైసీపీ అధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** టిడిపి ఇంచార్జ్ ప్రవీణ్ కుమార్ రెడ్డి కేవలం తన స్వలాభం కోసమే పోలీసులను మెచ్చుకున్నారని పట్టణ వైసీపీ అధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రవీణ్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి జిల్లా ఎస్పీ, ప్రొద్దుటూరు డిఎస్పీ, పోలీసులను దసరా ఉత్సవాలు సమర్థవంతంగా నిర్వహించారని ప్రశంసించారని, దసరా ఉత్సవాలను విజయవంతంగా పోలీసులు నిర్వహించడం ఆనందకరమేనని, కానీ గత 135 సంవత్సరాల పాటు ఉత్సవాలు ఘనంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండానే పోలీసులు చర్యలు తీసుకున్నారని వివరించారు. ఆయన గత 10 సంవత్సరాలుగా రాజకీయాల్లో వున్నా ఏనాడు పోలీసులను ప్రశంసించలేదని, కేవలం తన అసాంఘిక కార్యకలాపాలకు పోలీసుల మద్దతు కోసమే వారికి అభినందనలు తెలిపినట్టు విమర్శించారు. కాగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ప్రొద్దుటూరు పోలీసులపై అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను ఖండించారని, కానీ కనీసం ఎమ్మెల్యే పేరు కూడా చెప్పలేమి ప్రవీణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నే విమర్శించే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ని విమర్శించే స్థాయి లేదని సూచించారు. ఇకనైనా మాజీ ఎమ్మెల్యే రాచమల్లు పై విమర్శలు చేయడం మానుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కౌన్సిలర్లు మన్నె సత్యం, గుర్రం లావణ్య, రాగుల శాంతి, బలిమిడి వెంకటలక్ష్మి, నాయకురాలు గజ్జల కళావతి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ చేత ఉత్తమ ఉపాధ్యాయులకు ఆర్జేయూపి ఘన సత్కారం



**కడప ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇటీవల రాష్ట్రప్రభుత్వం చేత రాష్ట్ర స్థాయిలోఉత్తమ ఉపాధ్యాయ ఆవార్డు పొందిన 25 మంది ఉపాధ్యాయులకు మరియు ఇటీవల పదవీవిరమణ పొందిన 19 మంది సీనియర్ ఉపాధ్యాయులు, హెడ్మా స్టర్లు, మండల విద్యాశాఖాధికారులకు ఆర్జేయూపి ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిచే వివిధ జిల్లాల నుండి వచ్చిన వారిని ఘనంగా జ్ఞాపిక పూల మాల, దుశ్శాలువతో స్థానిక స్కౌటు హాలులో సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. త్వరలో పీఆర్సీ డీయే తదితర అంశాలపై ఒక స్పష్టత వస్తుందన్నారు. సంఘం రాష్ట్రఅధ్యక్షుడు డా.గునిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ పెండింగ్ సమస్యలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకో వాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో అధికార ప్రతినిధి ముత్తోజు వీరబ్రహ్మం, ప్రధాన కార్యదర్శి షరీఫ్, ప్రధాన సలహాదారు బాలకృష్ణ, టీచర్స్ హెూం అధ్యక్షుడు బండారు రాజగోపాల్, అనంతపురం జిల్లా అధ్యక్షులు రామానాయుడు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సిద్ధయ్య, కడపజిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రసాదరావు, పుల్లయ్య, కర్నూలు జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఆంజనేయులు, వీరయ్య, వీరన్న, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## వృతి విద్యలో భాగంగా పది రోజుల ఇంటర్న్ షిప్ కార్యక్రమం



**ఖాజీపేట, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి వొకేషనల్ ఎడ్యుకేషన్ (వృతి విద్యా) లో భాగంగా ఖాజీపేట మోడల్ స్కూల్ విద్యార్థులకు ఇంటర్న్ షిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ విజయ నరసింహ, జీసీడీవో డార్లరూత్ ఆరోగ్య మేరీ పాల్గొని నేటి పోటీ ప్రపంచంలో నైపుణ్యాల అవశ్యకతను పిల్లలకి తెలియపరుస్తూ ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు తమలోని నైపుణ్యాలు మెరుగుపరుచుకుని త్వరగా ఉపాధి పొందగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐటీ వృత్తి విద్యా (ఒకేషనల్ ఎడ్యుకేషన్) శిక్షకురాలు విజయమ్మ, జిల్లా కోఆర్డినేటర్ వంశీ పాల్గొన్నారు.

# భారత్ ను జగద్గురు స్థానంలో నిలపడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్:** పోరుమామిళ్ల పట్టణంలోని మలకత్వ ఆంజనేయ స్వామి గుడిలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రారంభించి విజయవంతంగా నూరు సంవత్సరాలు జరుపుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని శత జయంతి వేడుకలను కార్యకర్తలు ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ముందుగా సంస్థ వ్యవస్థాపకులు కేశవరావు బలిరామ్ హెడ్గేవార్, గురూజీ, భరతమాత చిత్రపటాలకు పూలమాలలు అలంకరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పోరుమామిళ్ల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ధర్మం కోసం ఆర్ఎస్ఎస్ గత 100 సంవత్సరాలుగా పనిచేస్తూ భారత దేశానికి ఒక రక్షణ కవచంగా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన రామకృష్ణ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు నిబద్ధత కలిగిన వారై వ్యక్తి నిర్మాణం తద్వారా భారత దేశ నిర్మాణం చేయడంలో అను శాసనంతో ఎటువంటి ఆడంబరాలకు వెళ్లకుండా నిరంతరం సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆపత్కాలంలో దేశాన్ని ఆదుకోవడంలో ఎల్లవేళలా ముందు నిలిచారని కొనియాడారు .1948,1962 ,1965 చైనా, పాకిస్తాన్ యుద్ధ సమయంలో భారత సైనికులకు అనేక సేవలందించి దేశం కోసం ప్రాణత్యాగానికి సిద్ధపడిన వారు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలని అన్నారు. అప్పటి ప్రధాని నెహ్రూ ఆర్ఎస్ఎస్ నిబద్ధతను సేవలను గుర్తించి 1963 సంవత్సరంలో ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల పెరేడ్లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు స్థానం కల్పించడం అనేది దేశంలో మరో చరిత్ర కు తార్కాణం అని చెప్పవచ్చు. అనేక సందర్భాల్లో ఆర్ఎస్ఎస్ ను అప్పటి కేంద్ర ప్రభుత్వం నిషేధించినప్పటికీ మొక్కవోని ధైర్యంతో కార్యకర్తలు దేశం కోసం పనిచేసి దేశానికి ఈ ధర్మానికి ఒక రక్షణ కవచంగా నిలిచారని అన్నారు. భారతదేశాన్ని ప్రపంచంలో జగద్గురు స్థానంలో నిలబెట్టడమే ఆర్ఎస్ఎస్ కార్యకర్తల లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైనటువంటి గ్రామ పెద్దలు మరియు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా శతజయంతి వేడుకల సందర్భంగా విజయోత్సవ బైక్ ర్యాలీని విజయవంతంగా నిర్వహించారు.

# గొల్లపల్లెలో నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు



**బ్రహ్మంగారిమఠం, మేజర్‌న్యూస్:** బ్రహ్మంగారిమఠం మండల పరిధిలోని రేకలకుంట పంచాయతీ గొల్లపల్లి గ్రామంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు టిడిపి మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి సూచనలతో బ్రహ్మంగారిమఠం మాజీ మండల అధ్యక్షులు మాలేపాటి సుబ్బారావు మరియు టిడిపి మండల యువ నాయకులు కానాల మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నూతన విద్యుత్ లైన్ల పనులను ప్రారంభించడం జరిగింది . ఎన్నో ఏళ్లుగా తమ గ్రామంలో విద్యుత్ సమస్యను పట్టించుకున్న నాయకులే లేరని, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చొరవతో తమ గ్రామం అభివృద్ధి చెందుతుందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు ఓబయ్య,లక్ష్మీనారాయణ,కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## వడుగుల (స్నాన) మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ



**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్:** పోరుమామిళ్ల పట్టణంలోని ఉద్దికట్ట వీధికి చెందిన షేక్ పీర్ల మహమ్మద్ మాహిర్ కుమారుడు మహమ్మద్ నిహార్ వడుగుల స్నాన మహోత్సవ వేడుకలో ఎమ్మెల్సీ డి. గోవింద రెడ్డి, మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి, రాళ్లపల్లి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం కోసం వ్యాయామం తప్పనిసరి

**సిఐ దస్తగిరి**



**ముద్దనూరు, మేజర్‌న్యూస్:** ప్రతి ఒక్కరు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామం తప్పనిసరి అని ముద్దనూరు సిఐ దస్తగిరి తెలిపారు. వ్యాయామం అవసరాన్ని ప్రజలకు తెలియజేసేందుకు ఆదివారం సైకిల్ ర్యాలీని చేపట్టినట్టు తెలిపారు ఈ ర్యాలీలో సిఐ దస్తగిరితో పాటు పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల భద్రతకు 'విజిబుల్ పోలీసింగ్'




**కడప క్రైమ్, మేజర్‌న్యూస్:** కడప జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పోలీసులు ఆదివారం 'విజిబుల్ పోలీసింగ్' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీసులు ప్రజలకు మరింత చేరువవుతూ, నేరాలను నియంత్రించడం, రహదారి భద్రతపై అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నగరంలో ద్విచక్ర వాహనాలు తనిఖీ నిర్వహించారు. అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి నిషేధిత వస్తువులు, గంజాయి వంటి వాటి అక్రమ రవాణాను అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నారు. రహదారి భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవర్లు సీటు బెల్టు పెట్టుకోవాలని స్పష్టం సూచించారు.
సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. అలాగే, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా పోలీసులు ప్రజల మధ్య ఉంటూ వారికి రక్షణ కల్పిస్తున్నారు. ప్రజలు భద్రతకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

# 7 ఎస్‌జిఎఫ్ టోర్నమెంట్, సెలక్షన్



**కలసపాడు, మేజర్‌న్యూస్ :** కలసపాడు మండలంలో అక్టోబర్ 07వ తేదీ మంగళవారం ఎస్‌జిఎఫ్ టోర్నమెంట్ కమ్ సెలెక్షన్స్ నిర్వహించడం జరుగుతుందని. ఈ పోటీలకు మండలంలోని ప్రభుత్వ. ప్రైవేటు.ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని ఈ పోటీలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కలసపాడు నందు నిర్వహించడం జరుగుతుందని ఈ పోటీలలో బాడ్మింటన్, చదరంగం, వాలీబాల్, యోగ, ఖో-ఖో, అథ్లెటిక్స్, కబడ్డీ మొదలగు పోటీలు మం గళవారం నిర్వహించడం జరుగుతుందని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సి.రవిచంద్రుడు తెలిపారు. కలసపాడు మండల పరిధిలోని 14మరియు 17సంవత్సరాలు కలిగిన విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని వారు వెల్ల డించారు. సెలెక్షన్స్ లో పాల్గొనేటువంటి విద్యార్థులు తమ పాఠశాల నుండి స్టడీ సర్టిఫికెట్ తీసుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి పీడీలు, పి.ఈ. టిలు, ఆసక్తి కలిగిన ఆటగాళ్లు ఉదయం 9గంటలకు తప్పనిసరిగా ప్రాంగణానికి హాజరు కావాలని వారు సూచించారు.

## పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని బహుకరించిన రఘునాథరెడ్డి



**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీ పరిధిలోని మహబూబ్ నగర్ మరాటి వీధిలో శ్రీ అభయాంజనేయ స్వామి నూతన విగ్రహ ప్రతిష్ట కుంభాభిషేక మహోత్సవం లో భాగంగా 25 వేల రూపాయలు విలువ చేసే శ్రీ అభయ ఆంజనేయస్వామి పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని పులివీడు సర్పంచ్ తిమ్మారెడ్డి రఘునాథరెడ్డి, ధర్మ పత్ని లక్ష్మి దేవి దంపతులు బహుకరించారు.

## మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిన వ్యక్తి అరెస్ట్

**కేసు నమోదు చేసిన పోలీసులు**

**పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్ల ఎస్సైకొండారెడ్డి ఉత్తర్వుల మేరకు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరెడ్డి ఆదివారం పోరుమామిళ్ళ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద వాహనాలు నడుపుతున వ్యక్తులను బ్రీత్ అనలైజర్ తో తనిఖీ చేసి మద్యం సేవించి ద్విచక్ర వాహనాన్ని నడిపిన వ్యక్తిని అరెస్ట్ చేసి అతడి వాహనమును సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

# మాజీ సైనికులు ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోవాలి

**సొసైటీ చీఫ్ ప్రమోటర్ గోవర్ధన్ రెడ్డి**




**కడప టౌన్, మేజర్ న్యూస్ :** ఉమ్మడి కడప జిల్లాలో ఇళ్ల స్థలాలు లేని మాజీ సైనికులు, వీరనారీమణులు, మాజీ పారామిలటరీ జవాన్లు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ది జై జవాన్ మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ చీఫ్ ప్రమోటర్, చైర్మన్ వి.గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఆదివారం కడప జే.ఎం.ఏ.సి.హెచ్.బి.ఎస్ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ రాష్ట్ర విడిపోకముందు కొన్ని మాజీ సైనిక సంఘాలు ఇళ్ల స్థలాల పేరుతో సంఘాలు ఏర్పాటు చేసుకుని దరఖాస్తు ఫీజుతో మాజీ సైనికుల నుంచి అధిక మొత్తం వసూలు చేశారన్నారు. ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలాలు పొందలేక పోయారు. ఇక మాజీ సైనికులు మోసపోకుండా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ డిపార్ట్మెంట్ నుంచి అక్టోబర్ 27 2008 జీవో ఎంఎస్ నెంబర్ 1241 విడుదల చేసి మాజీ సైనికులకు 175 గజాలు ఇళ్ల స్థల కోసం అవకాశం కల్పించిందన్నారు. ది జై జవాన్ మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ స్థాపించామని వెల్లడించారు. 11 మంది సభ్యులు ఉన్నారని చెప్పారు. ఉమ్మడి కడప జిల్లాలో ఉండే మాజీ సైనికులు, వీరనారీమణులకు ఇళ్ల స్థలాల కోసం సొసైటీ బైలా ప్రకారం రూ. 500 చెల్లించి సభ్యత్వం తీసుకోనీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. డిష్ ఛార్జ్ బుక్కు, ఐడి కార్డు, ఆధార్ కార్డు నాలుగు జిరాక్స్ కాపీలతో కడప ఆర్టీసీ బస్టాండ్ దగ్గరలో సింహపురి కాలనీ, డోర్ నెంబర్ 42/347/ 8-2 మేడ పైన కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. వివరా లకు 8341699018, 9849282079 సంప్రదించండి. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వి.రమణ, భాను ప్రతాప్ జాయింట్ సెక్రటరీ పి.ధనంజయ, వెంకటేశ్వరరావు,నాగేంద్ర రెడ్డి,ఎం. కిషోర్ రెడ్డి, పి.రాఘవాచారి తదితరులు పాల్గొన్నారు.

# ఖిద్మాత్ ఎ ఉమ్రా ట్రావెల్స్ ప్రారంభం



**కడప టౌన్, మేజర్‌న్యూస్:** నగరంలోని మాసాపేట సమీపంలో ఉన్న నీటి ట్యాంక్ దగ్గర ఖిద్మాత్ ఎ ఉమ్రా ట్రావెల్స్ ను ఆదివారం మత గురువు అస్తానే ఖాన్ ఖానే ఎ ఔలియా పీఠం పీఠాధిపతి సయ్యద్ షా మొహమ్మద్ మసూరు రాజి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, నగర మేయిర్ ముంతాజ్ బేగం, మాజీ మేయర్ సురేష్ బాబులు కలసి ప్రారంభించారు. ముందుగా ఖిద్మాత్ ఎ ఉమ్రా ట్రావెల్స్ అధినేత షేక్ అలిషేర్‌కి శుభాకాంక్షలు తెలిపారు. ఇరువురు మాట్లాడుతూ పేద ముస్లిం కుటుంబాలకు ఇది చక్కటి అవకాశం అని ప్రతి ముస్లిం తన జీవితంలో ప్రముఖ పుణ్యస్థలమైన మక్కా నందు ఉమ్రా చేయాలని ఇస్లాం మహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రదేశం చూడాలని ప్రతి ఒక్కరి తపన అని జీవితంలో మరణించే దాకైనా ఉమ్రా చేయాలని కోరిక ఉంటుందని ఆ కోరికను నెరవేర్చడానికి ఖిద్మాత్ ఎ ఉమ్రా ట్రావెల్స్ అతి తక్కువ ధరతో ఉమ్రాకు పంపడానికి ముందుకు రావడం చాలా సంతోషకరమన్నారు. ఉమ్రా చేయాలంటే కనీసం రూ.లక్ష ఉంటుందని.అంత స్తోమత లేని వారి కోసం ఇది చక్కటి అవకాశం అన్నారు.కేవలం రూ. 4999 కడితే టికెట్ బుక్ చేస్తారు. అని మిగతా డబ్బులు వాయిదా పద్ధతిలో కట్టుకోవచ్చు అని వారు తెలిపారు. ట్రావెల్స్ అధినేత షేక్‌అలిషేర్ మాట్లాడుతు ప్రతి ముస్లిం జీవితంలో ఒకసారి అయినా ఉమ్రా చేయాలని తపన ఉంటుందని ఆ ఆశను అల్లా దయతో మేము నెరవేస్తాము. ఉమ్రా పంపించడానికి ముస్లిం సోదరులకు సేవ చేయాలని ఉద్దేశంతో మేము ముందుకు వచ్చినామన్నారు. రాష్ట్రంలో అని చోట్ల ఖిద్మాత్ ఎ ఉమ్రా ట్రావెల్స్ కార్యాలయాలు తెరవ బోతున్నాము అన్నారు. ఈ కార్యక్రమం లో నిర్వాహకులు జమీర్, ఆఫ్జాల్, జన వికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు తాహిర్,మాజీ డిసిసి అధ్యక్షులు నజీర్ అహ్మద్, సంఘసేవకులు సలాద్దీన్, టిడిపి డాక్టర్ సెల్ ప్రెసిడెంట్ డాక్టర్ నాజిముద్దీన్, టిడిపి పార్టీ ఎన్ ఆర్ ఐ విభాగం ప్రతినిధి రహంతుల్లాహ్, టిడిపి టి ఎన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివ, నగరప్రముఖులు షంషేర్,మెహమ్మద్, సర్దార్, సరస్వతి, అనూష,గౌస్ పాల్గొన్నారు.

# మొపూరి భైరవేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు

**పులివెందుల రూరల్ మేజర్న్యూస్ :** పులివెందుల నియోజకవర్గం వేముల మండలం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) శ్రీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆదివారం వేముల మండలంలోని ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం శ్రీ మొపూరి భైరవేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. భైరవేశ్వర స్వామికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నూతన వంట గది ప్రారంభం:

స్వామి వారి దర్శనం అనంతరం, దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన వంట గదిని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భైరవేశ్వర స్వామి క్షేత్రానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని, వారి కోసం అన్నదానం, ఇతర కార్యక్రమాలకు ఈ వంట గది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. దైవ కార్యాలకు అండగా నిలవడం అభినందనీయం అని పేర్కొంటూ, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న దేవస్థానం చైర్మన్ ని, దాతలను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో



దేవస్థానం ఛైర్మన్ శ్రీ ఓబుల్ రెడ్డి రమణా రెడ్డి , వంట గది నిర్మాణానికి సహకరించిన దాతలు గంగరాజు యాదవ్ , మరియు వారి కుటుంబ సభ్యులు అనంతరం, దాత శ్రీ గంగరాజు యాదవ్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి గారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఓబులరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, వెంకట కృష్ణ రెడ్డి, గంగి రెడ్డి, జ్ఞానేశ్వర్ నాయుడు, పుల్లారెడ్డి, కేశవ రాజు తదితరులు పాల్గొన్నారు

## ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పి. అపర్ణకు అవార్డు

### అపుస్మా ఆధ్వర్యంలో ఘనంగా అవార్డు ప్రదానోత్సవం

### ఇది మా పాఠశాల గౌరవం – శ్రీ నారాయణ పాఠశాల కరెస్పాండెంట్..




**కమలాపురం మేజర్న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కడప జిల్లా పరిషత్ కమ్యూనిటీ హాల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది, ఈ కార్యక్రమంలో కమలాపురంలోని శ్రీ నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల తరపున ఉపాధ్యాయురాలు పీ. అపర్ణ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికై అవార్డును అందుకున్నారు, శ్రీ నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరెస్పాండెంట్ కుంచం అనంత రెడ్డి మాట్లాడుతూ మా పాఠశాలకు ఈ గౌరవం దక్కడంతో మా పాఠశాల తరపున ఉపాధ్యాయురాలు పి అపర్ణను ఎంపిక చేయడం జరిగిందన్నారు, ఎంతో ఆనందదాయకం, ఉపాధ్యాయుల కృషికి ఇదొక గుర్తింపు, ఈ తరహా ప్రోత్సాహక కార్యక్రమాలు మరింత స్ఫూర్తిని ఇస్తాయి అని పేర్కొన్నారు, అవార్డు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అపుస్మా సంస్థకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు..

## దర్శ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రధానం – ఐటా




**కడప ఎడ్యుకేషన్ మేజర్న్యూస్ :** అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఈ దినం (05/20/2025) ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ (ఐటా) కడప జిల్లా శాఖ కడప జిల్లాలోని 6 మంది ఉపాధ్యాయులకు వారి సేవలను గుర్తించి వారికి ఆదర్శ ఉపాధ్యాయుల అవార్డుతో ఘనంగా సత్కరించడం జరిగినది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కడప ఎంఈఓ శ్రీ రఫీక్ అహ్మద్ గారు, ఐటా రాష్ట్ర మాజీ అధ్యక్షులు అబ్దుల్ రజాక్ జిల్లా కార్యదర్శి అబ్బాస్ అలీ మరియు ముస్లిం సమైక్యా వేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ పాల్గొన్నారు. శ్రీ సలావుద్దీన్ మాట్లాడుతూ విద్య యొక్క విలువల గురించి తెలియజేసినారు. భావి భారత పౌరులైన విద్యార్థులను తీర్చిదిద్దేవారు ఉపాధ్యాయులని, వారి సేవలను గుర్తించి సత్కరించడం అభినందనీయమని తెలియజేసినారు. విద్యార్థులు కూడా వారి తల్లిదండ్రుల యొక్క ఆశయాలకు అనుగుణంగా మెలుగుతూ చక్కగా చదువుకోవాలని తద్వారా పుట్టిన ఊరికి దేశానికి సేవ చేయాలని మార్గదర్శకం నిర్దేశించారు.

## పులివెందుల లోవిస్తృతంగా సంతకాల సేకరణ

### కాంగ్రెస్ నాయకులు ఖాదర్ వల్లి



**పులివెందుల మేజర్న్యూస్ :** పులివెందుల కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు బోనాల ఖాదర్ వల్లి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మూలం రెడ్డి ధ్రువ కుమార్ రెడ్డి ఆదేశాల మెరకు నగర అధ్యక్షులు భోనాల ఖాదర్ వల్లి నేతృత్వంలో ఓటర్ల జాబితాలోని అవకతవకలను నిరసిస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రచారం ప్రారంభమైంది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న ఎన్డీఏ కూటమిపై విమర్శలు చేస్తూ, ప్రజల ఓట్లను దోచి మూడోసారి అధికారంలోకి వచ్చినట్టు కాంగ్రెస్ పార్టీ ఆవేదన వ్యక్తం చేసింది. ఓటర్ల జాబితాల్లో లేని ఓట్లను ఉన్నట్లుగా చూపించడం, నిజమైన ఓట్లను తొలగించడం వల్ల ప్రజాస్వామ్యం అవమానించబడిందని, నిజమైన ఓటర్లు తమ హక్కులను వినియోగించలేకపోతున్నారని బోనాల ఖాదర్ వల్లి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమేష్,మహిళా నాయకులు విజయ,నాయకులు చంద్ర బాబు, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

## భగవత్ గీతా శ్లోకాలు విష్ణు సహస్ర నామావళి పై శిక్షణ తరగతులు



**సింహాద్రిపురం మేజర్న్యూస్ :** సింహాద్రిపురం బైపాస్ రోడ్డు సమీపాన ఉన్న గంగమ్మ దేవత ఆలయం లో ఆదివారం సాయింత్రం 5 గం నుంచి 6 గంవరకు 12 సంవత్సరాల బాల బాలికలకు భగవత్ గీతా విష్ణు సహస్ర నామావళి మరియు సంస్కారం పై శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు నిర్వ హుకులు తెలిపారు.ఈ శిక్షణ తరగ తులు సునీత ఆధ్వర్యంలో నిర్వ హించా నున్నారు. రెండో శనివారం ప్రతి ఆదివారం శిక్షణ తరగతులు జరగ నున్నాయని ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లి తండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆలయ నిర్వహకులు తెలిపారు.

## అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న సంక్షేమ అధికారులు

### పై విచారణ జరిపించాలి పిడియస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న




**కడప ఎడ్యుకేషన్ మేజర్న్యూస్ :** కడప,అన్నమ్మయ్య జిల్లాలో ఎస్సీ సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ వేనక బడిన తరగతుల సంక్షేమ శాఖలో వున్నా వసతి గృహాలను విద్యార్థులకు మెనూ ప్రకారం పెట్టకుండా నాణ్యత తగ్గిస్తూ స్వయానా జిల్లా అధికారులే ప్రతి నెల వసతి గృహ అధికారులు దగ్గర మామూలు తీసుకుంటున్నారని పిడిఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న విచారణ జరపాలని జిల్లా కలెక్టర్లను విజ్ఞప్తి చేశారు. ఆదివారం కడప నగరంలో పిడియస్ యు రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కడప,అన్నమ్మయ్య జిల్లాలో ఎస్సీ సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలో నడుస్తున్న వసతి గృహాలలో విద్యార్థులు చదువులు అభ్యసిస్తున్నారని వారి పరవేక్షణకు వసతి గృహ అధికారులు వ్యవహరిస్తూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యత లేకుండా చేస్తూ వసతిగృహా అధికారులు పై స్థాయి అధికారులు ఎస్ డబ్ల్యూఓ, సహాయ సంక్షేమ అధికారులు,నుండి పై స్థాయి జిల్లా అధికారుల వరకు ప్రతినెల మామూలు తీసుకున్నట్లు అందుకు నిదర్శనమే ఇంచార్జి వసతి గృహాధికారులు సమీప వసతి గృహాలు ఇంచార్జిగా నియమించకుండా వారి దగ్గర వేలాది రూపాయలు డబ్బులు తీసుకొని దూరం వున్నా వారిని ఇంచార్జిగా వసతి గృహధికారులును నియమించారని,స్థానికంగా వసతి గృహాధికారులు ఉండవలసి ఉండగా ఉండటం లేదన్నారు.కావున కడప,అన్నమ్మయ్య జిల్లా కలెక్టర్లు స్పందించి విచారణ జరిపి బాధ్యులైన ఎస్సీ,బిసి సంక్షేమ శాఖ అధికారుల పై చర్యలు తీసుకువాలని డిమాండ్ చేశారు.

## ఆరోగ్యమే.. మహాభాగ్యం

### కడప జిల్లా అడిషనల్ ఎస్పీ రమణయ్య



**కడప క్రైమ్ మేజర్న్యూస్ :** కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలతో ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమం పోలీస్ అధికారులు ఆదివారం కడప నగరంలో నిర్వహించారు, ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ రమణయ్య మాట్లాడుతూ ప్రతి ఆదివారం పోలీసులు , ప్రజలు సైక్లింగ్ను అలవాటుగా చేసుకుని శారీరక దృఢత్వం , ఆరోగ్యాన్ని కాపాడుకునే విధంగా చేయడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వాహన కాలుష్యాన్ని తగ్గించడం, పర్యావరణ స్థిరత్వానికి దోహదపడటం వంటి అవగాహన కార్యక్రమాలు ప్రజలకు తెలపడం ఎంతో ముఖ్యమని తెలిపారు,ప్రతి ఒక్కరూ శారీరక వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలని, అది వ్యక్తిగత ఆరోగ్యానికి ఎంతో అవసరమని ఆయన అన్నారు, ఇలాంటి సైక్లింగ్ ల వల్ల శరీరానికి రోగనిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు, ఈ సైకిల్ ర్యాలీ జిల్లా పోలీసు కార్యాలయం నుండి ప్రారంభమై ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, సంధ్య సర్కిల్, ఎర్రముక్కపల్లి సర్కిల్, మహావీర్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, ఎస్పీ బంగ్లా, రాజారెడ్డి వీధి మీదుగా జిల్లా పోలీసు కార్యాలయం వరకు కొనసాగింది.ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ తో పాటు ఏ.ఆర్ డి.ఎస్.పి నాగేశ్వర రావు, ఆర్.ఐ లు శివరాముడు, టైటస్, శ్రీశైల రెడ్డి, కడప టూ టౌన్ సి.ఐ గంటా సుబ్బారావు, చిన్నచౌకు సి.ఐ ఓబులేసు, ట్రాఫిక్ సి.ఐ జావీద్, పెండ్లిమర్రి ఎస్.ఐ మధుసూదన్ రెడ్డి, కడప వన్ టౌన్ ఎస్.ఐ ప్రతాప్ రెడ్డి, ఆర్.ఎస్.ఐ లు వెంకటేశ్వర్లు, స్వామినాయక్, రామస్వామి రాజు, చూడామణి వర్మ, పోలీస్ అధికారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఏ.ఆర్, సివిల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందల పట్టణం పార్నపల్లి రోడ్డు సమీ పంలో నడిబొడ్డున కొలువై ఉన్న అంకాలమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయాస్తమాన అమ్మవారికి పంచామృ తాభిషేకం, సహస్రనామార్చన, కుంకు మార్చన, తదితర పూజా కైకర్యాల అనం తరం పట్టు వస్త్రాలతో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్ మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు అందుకొని మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని, ప్రతి ఆదివారం ఆలయానికి వస్తున్నటువంటి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక చర్యలు ఏర్పాటు చేస్తూ జాగ్రత్తలు వహిస్తున్నామని తెలిపారు.అనంతరం ఆలయ నిర్వహణ ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు ఎండోమెంట్ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సిపి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా- మాడిశెట్టి



**ఎర్రగుంట్ల మేజర్‌న్యూస్ :** వైయస్సార్సీపి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎర్ర గుంట్ల పురపాలిక కు చెందిన మాడిశెట్టి శివ కుమార్ ను నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. మాడిశెట్టి శివ ఇప్పటివరకు ఆ పార్టీ మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు ఉన్న తాజాగా ఈయనకు పార్టీలో రాష్ట్రస్థాయి బాధ్య తలను అప్పగిస్తూ నిర్ణయం తీసుకో వడంతో ఈ ప్రాంతంలోని వైఎస్ఆర్సిపి కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తనకు పార్టీ పదవి దక్కడం వెనుక కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి, జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి కృషి ఉందని ఆయన గుర్తు చేస్తూ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైఎస్ఆర్సిపి పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

# ఫీజు రీయింబర్స్మెంట్ పూర్తి స్థాయిలో విడుదల చేయాలి




**కడప ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా 6400 కోట్ల రూపాయలు బకాయిల్లో ఉన్న సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం 400 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకోవడం సిగ్గుచేటని శనివారం కడప ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ అన్నారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ... ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు 6400 కోట్లు ఉంటే కేవలం ఉంటే 400 కోట్లు మాత్రమే విడుదల చెయ్యడం సరికాదని పూర్తి బకాయిలు చెల్లిస్తే ఏ ఒక విద్యార్థికి సమస్య రాకుండా ఉంటుందని వారన్నారు. అదేవిధంగా 400 కోట్లు పడడంలో ఏ విద్యా వ్యవస్థ విద్యార్థుల భవిష్యత్తుకు ముందుకు సాగేటువంటి పరినామం కనిపిం చట్లేదని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలు ఎంతో అవస్థలు పడుతున్నారు అని విద్యార్థులకు, విద్యాసంస్థలకు ఎలాంటి ఇబ్బందులు కలువకుండా విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలంటే ఎన్నికల సమయంలో చెప్పినటువంటి హామీలను అమలు చేయాలని పూర్తి రియంబర్స్మెంట్ విడుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి. తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నియంత్రణ

### దోమలు లేని నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు - నగరపాలక సంస్థ వైద్యాధికారి డాక్టర్ రమేష్

**కడప క్రైమ్ మేజర్‌న్యూస్ :** వర్షాకాలం నేపథ్యంలో ఇళ్లతోపాటు పరిసరాలలో అపరిశుభ్రత, రోడ్లపై బురద, చిత్తడి కారణంగా దోమలు వ్యాప్తి చెందే అవ కాశాలు అధికంగా ఉన్నాయని కడప నగరపాలక సంస్థ వైద్యాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. ఆదివారం ఆయన సూర్య పేపర్ ప్రతినిధితో మాట్లాడుతూ దోమల నివారణకు పగడ్బందీ చర్యలు చేపడుతున్నామని ఆయన అన్నారు. ప్రతిరోజు దోమల నివారణ పై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు పాఠశాలలో, కళాశాలలో విద్యార్థులకు కూడా అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సాధించామన్నారు. నగర ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నియంత్రణ సాధ్యమవుతుందని ఆయన చెప్పారు. ఇల్లు, పరిసరాలలో అపరిశుభ్రత, రోజులుగా నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయి వాటి నివారణకు ఉదయం యాంటీ లార్వా ఆపరేషన్, సాయంత్రం దోమల మందు పిచికారితో పాటు పాగింగ్ తదితర చర్యలను నిరంతరం చేపడుతున్నామని ఆయన తెలియజేశారు. నగర ప్రజల సహాయ సహకారాలతో కడప నగరంలో అన్ని డివిజన్లో దోమల నివారణకు ప్రత్యేక ప్రణాళికలు ఏర్పాటు చేసుకొని మొద లుపెట్టామని అన్నారు. ఇళ్ల ముందర ఉన్న మురుగు నీటి కాలువల్లో ఆహార వ్యక్తప దార్థాలు వేయడం వల్ల మురుగునీటిలో లార్వా ఉత్పత్తి అయ్యి దోమలు వృద్ధి చెందుతాయి. ఒక దోమ లార్వా ద్వారా 1000 నుంచి 3000 దోమలను ఉత్పత్తి చేస్తుంది. కాబట్టి నగర ప్రజలు ఇలాంటి తప్పిదాలు చేయకుండా దోమలను నివారించేందుకు నగరపాలక సంస్థ అధికారులకు సిబ్బందికి సహాయ



సహకారాలు అందించి ఆరోగ్యంగా ఉండాలని నగరపాలక సంస్థ వైద్యాధికారి డాక్టర్ రమేష్ కోరారు.

# మీ కోసం కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోండి

## డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

**కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించు కోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని డిఆర్వో కోరారు.

### పాత పిజిఆర్ఎస్ లో నిర్వహణ..

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను ఈ సోమవారం పాత పిజిఆర్ఎస్ లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు లినమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చును"ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ" అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించు కోవచ్చునన్నారు


### డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం..

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

### నాయకులు బాలకొండయ్య,జానకిరామ్ - వడ్డెర సంఘం నూతన కమిటీ ఏర్పాటు

**కడప టౌన్, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం వడ్డెరలను ఎస్టీ జాబితాలో వెంటనే చేర్చాలని వడ్డెర సంఘం నాయకులు ఓర్స్ బాలకొండయ్య, బత్తల జానకిరామ్ లు డిమాండ్ చేశారు. ఆదివారం వడ్డెర సంఘం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి ,నూతన కమిటీని ఎన్నుకున్నారు .సంఘం నూతన గౌరవ అధ్యక్షులుగా బత్తల జానకి రామ్, జిల్లా అధ్యక్షులుగా దేరంగుల శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా బత్తల శీను, ప్రధాన కార్యదర్శిగా వెంకట్ ,కోశాధికారిగా గంపా శీను లను ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వడ్డెర సమస్యలను పరిష్కరించేందుకు నూతన కార్యవర్గం ముందుకు పోవాలన్నారు. జిల్లాలో వడ్డెర సమస్యలు పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వారికి అందేలా చూడాలన్నారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కమిటీ నాయకులు కృషి చేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే సంఘ నాయకులు సంప్రదిస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్విని చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమం అనంతరం నూతన కమిటీ సభ్యులకు



శాలువాలు వేసి, పూలమాలలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి, ఉపాధ్యక్షులు బండారు వెంకటరమణ, మల్లికార్జున, వెంకటసుబ్బయ్య, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ గండికోట వెంకటసుబ్బయ్య, యూత్ నాయకులు గంపా వెంకటసుబ్బయ్య, మల్లి,ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రగుంట్లలో ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు





**ఎర్రగుంట్ల మేజర్‌న్యూస్ :** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర హైస్కూల్ లో ఆర్ఎస్ఎస్ శతాబ్ద ఉత్సవాలలో భాగంగా విజయదశమి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యాపారవేత్త మురళీధర్ రెడ్డి, జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ జయపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు 1925లో విజయదశమి రోజున హెగ్డే వార్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘాన్ని ప్రారంభించారన్నారు. నేటికీ 100 సంవత్సరాలు పూర్తి అయినదని ఆనాటి నుండి ఈనాటి వరకు ఎన్నో ఆటుపోట్లు ఎదురైనప్పటికీ అగ్ని పునీతుల సంఘం నిలబడిందని తెలిపారు. ప్రజలకు సేవ చేస్తూ పేదల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు ఆర్ఎస్ఎస్ కృషి చేస్తుందన్నారు. దేశం కోసం ధర్మం కోసం సంఘం పనిచేస్తున్న తీరును వివరించారు కాషాయ జెండా అనే గురువుగా భరతమాతను తల్లిగా భావించి కొన్ని లక్షల మంది స్వయం సేవకులు దేశం కోసం పనిచేస్తున్నారని గుర్తు చేశారు. సమాజంలో సాంస్కృతిక ఐక్యతను పెంపొందించి ఆర్ఎస్ఎస్ లక్ష్యసాధనకు సమిష్టి కృషి చేయాలన్నారు. దేశంలో హిందూ సమాజంలో సంగటిత శక్తిని పెంపొందించేలా పనిచేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆర్ఎస్ఎస్ లో భాగమై దేశ రక్షణకై పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖండ కార్యవాహ యోగానంద రెడ్డి, ఖండ ప్రభారి జయకృష్ణ, సంపర్క్ ప్రముఖ్ మల్లు నాగార్జున రెడ్డి, శారీరక్ ప్రముఖ్ సునీల్, ఘట ప్రముఖ్ ప్రసాద్ రెడ్డి, ఘట నాయకులు, విశ్వహిందూ పరిషత్ నాయకులు, వివిధ క్షేత్రాల నాయకులు, పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అంబకపల్లె గ్రామంలో వైసీపీ నుండి టిడిపిలోకి 20 కుటుంబాలు చేరిక

### పులివెందుల తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి బీటెక్ రవి ఆధ్వర్యంలో



**లింగాల మేజర్‌న్యూస్ :** లింగాల మండలంలోని అంబకపల్లి గ్రామంలో ఆదివారం పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి మా రెడ్డి, రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ పార్టీ నుండి తెలుగుదేశం పార్టీలోకి చేరికలు బీటెక్ రవి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలోకి కండువాలు కప్పి ఆహ్వానించారు వైసీపీకి, చెందిన రామకృష్ణ రెడ్డి, లోకేశ్వర రెడ్డి, లక్ష్మీ రెడ్డి, అశోక్ రెడ్డి, నాగార్జున రెడ్డి, తో సహా 20 కుటుంబాలు టీడీపీ నాయకులు లింగాల మండల ఇంచార్జ్ విశ్వనాథ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు దేవిరెడ్డి సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో బీటెక్ రవి సమక్షంలో వైసీపీ పార్టీని వీడీ తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు

**కడప టౌన్,మేజర్‌న్యూస్ :** శిల్పారామం లో సాయంత్రం సాంస్కృతిక కళావేదిక మీద మిస్పా మూవీ మీడియా డైరెక్టర్ సి.పద్మాకర్ వారి సహకారంతో కడప నగరానికి చెందిన కిషోర్ డాన్స్ అకాడమీ విద్యార్థిని, విద్యార్థులు పల్లె జానపదాలు, శాస్త్రీయ నృత్యాలు, సినీ వృత్యాలతో ప్రేక్షకుల అలరించినాయి.పాటలు...రాను రాను బొంబాయికి రాను, వస్తావా జానకి, ఇస్మార్ట్ శంకర్, తదితరాలకు నర్తించారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు శిల్పారామంలో జన సందడి కనిపించింది. ఈ కార్యక్రమం శిల్పారామం పరిపాలన అధికారి యస్. కృష్ణ ప్రసాద్ పర్యవేక్షణలో



# చర్మ సౌందర్యానికి రాగి

### - ఇవి పోషక విలువలు కలిగిన తృణధాన్యాలు



**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** మిల్లెట్స్ లో ఒకటైన రాగులు మన ఆరో గ్యానికి వేలు మేలు అంతా ఇంతా కాదు. ఇవి పోషక విలువలు కలిగిన తృణధాన్యాలు. రాగిని ఆహారం లో చేర్చడం ద్వారా ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు లభిస్తాయి. రాగులు కాల్షియం, ఐరన్, ఫైబర్, ప్రొటీన్, విటమిన్ బి వంటి పోషకాలకు గొప్ప మూలం. ఇందు లో ఇతర తృణధాన్యాల కంటే ఎక్కువ కాల్షియం ఉంటుంది, ఇది ఎముకల ఆరోగ్యానికి చాలా అవస రం. రాగుల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. రాగులు అధిక రక్తపోటుతో బాధపడేవారికి మంచి టానిక్ లా పనిచేస్తాయి. అనేక ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా రాగి అందిస్తుంది. సహజ మార్గాల్లో చర్మ సంరక్షణను కోరుకునే ప్రతి ఒక్కరికీ రాగి ఉత్తమమైన ఆప్షన్. రాగులను చర్మానికి కూడా ఉపయోగించవచ్చు. రాగి ఫేస్ ప్యాక్ చర్మానికి అనేక విధాలుగా సహాయపడుతుంది. రాగిలో యాంటీఅక్సిడెంట్లు, ఖనిజాలు, విటమిన్లు పుష్కలంగా ఉండటంతో చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచి సహజమ్మైన మెరుపుని అందిస్తాయి. ప్రత్యేకంగా రాగి పొడిని ఫేస్ ప్యాక్ గా ఉపయోగించడం వల్ల మొటిమలు, మచ్చలు, చర్మం ఎండిపోవడం వంటి సమస్యలు తగ్గించుకోవచ్చంట. రాగుల్లో యాంటీమైక్రోబయల్ లక్షణాలు మొటిమలను తగ్గించడంలో సహాయపడతాయి. రాగుల్లోని విటమిన్లు, ఖనిజాలు చర్మం మచ్చలను తగ్గించడంలో సహాయపడతాయి. రాగుల్లోని యాంటీ అక్సిడెంట్లు చర్మంపై ముడతలను తగ్గించడంలో సహాయపడతాయి. రాగుల్లోని ఫైబర్ చర్మం తేమను నిలుపుకోవడానికి సహాయపడుతుంది. రాగి ఫేస్ ప్యాక్ తయారీ కోసం 2 " టేబుల్ స్పూన్లు రాగి పొడి, 1 టేబుల్ స్పూన్ తేనె, 1 టేబుల్ స్పూన్ పెరుగు, కొద్దిగా నిమ్మకాయ రసం కలిపి మెత్తగా పేస్ట్ చేయాలి. దీన్ని ముఖానికి అప్లై చేసి 15-20 నిమిషాల పాటు అలా వదిలేయాలి. తర్వాత గోరువెచ్చని నీటితో మృదువుగా కడిగితే చర్మం కాంతివంతంగా మారుతుంది. రాగి ఫేస్ ప్యాక్ మృతకణాలను తొలగించడంతో పాటు చర్మాన్ని మృదువుగా మార్చే సహజ ఎక్స్ ఫోలియంట్ గా పనిచేస్తుంది. రాగిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ముడతలను తగ్గించి, యవ్వనాన్ని కాపాడతాయి.అంతేకాకుండా ఇది చర్మానికి తగినంత తేమను అందించి పొడిబారకుండా ఉంచుతుంది. చర్మాన్ని సహజంగా మెరుగుపర్చుకోవాలనుకునేవారు రాగిని ఫేస్ ప్యాక్గా మాత్రమే కాకుండా తమ రోజువారి ఆహారంలో భాగంగా కూడా తీసుకుంటే మరింత మెరుగైన ఫలితాలు పొందవచ్చు. రాగిని ఆహారంలో చేర్చడం ద్వారా కూడా చర్మ కాంతి పెరుగుతుంది. రాగి గంజి, రాగి దోస, రాగి చపాతీల వంటి ఆహార పదార్థాలు శరీరానికి అవసరమైన పోషకాలను అందించి చర్మాన్ని ఫ్రెష్ గా ఉంచుతాయి. రాగి పేస్ ప్యాక్ ను వారానికి 2-3 సార్లు ఉపయోగించవచ్చు. అయితే మీకు రాగులు అలర్జీ ఉంటే ఈ ఫేస్ ప్యాక్ ను ఉపయోగించవద్దు. ఫేస్ ప్యాక్ ఉపయోగించే ముందు మీ చర్మానికి సరిపోతుందో లేదో తెలుసుకోవడానికి ఒక చిన్న ప్యాచ్ టెస్ట్ చేయడం మంచిది.

# పులివెందుల మార్కెట్ యార్డు కొత్త చరిత్రకు నాంది

## మార్కెట్ యార్డ్ చైర్మన్ గాగడ్డం అమర్నాథ్ యాదవ్ ప్రమాణ స్వీకారోత్సవం






**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల మార్కెట్ యార్డు కొత్త చరిత్రకు నాంది చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగిందిలి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి , కూటమి నాయకులు, మార్కెట్ యార్డు సభ్యులు, వందలాది కార్యకర్తలు, రైతులు హాజరై చప్పట్లు కొడుతూ కొత్త పాలకవర్గానికి మద్దతు పండుగ వాతావరణంలో నిండి పోయింది. పులివెందుల మార్కెట్ యార్డు ప్రాంగణం నాయకులు, కార్యకర్తలు, రైతులతో కిటకిటలాడింది.గడ్డం అమర్నాథ్ యాదవ్ మార్కెట్ యార్డు చైర్మన్‌గా, చంద్రవర్ధన్ రెడ్డి వైస్ చైర్మన్‌గా ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ అమర్నాథ్ యాదవ్ మాట్లాడుతూ ముందుగా చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ నారా లోకేష్ అదేవిధంగా పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి పులివెందుల నియోజకవర్గ టిడిపి నాయకులు తనపై నమ్మకం ఉంచి మార్కెట్ యార్డ్ చైర్మన్గా పదవికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ రుణపడి ఉంటానని తనకు అప్పగించిన మార్కెట్ యార్డ్ పదవి రైతాంగానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు ముందుండి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం మార్కెట్ యార్డ్ చైర్మన్ అమర్నాథ్ యాదవ్ కు పలువురు అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

ఏపీ,తెలంగాణాలలో జాబ్ కాలెండర్ త్వరలో....

# జాబ్ కేలండర్‌కు సిద్ధం కండి..!

**ఫలితాలు, కేసులు అంటూ కొంత ఆలస్యం అయిప్పటికినీ ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఉద్యోగాలు పొందిన నిరుద్యోగులు సంతోషంలో ఉన్నారు. సాక్షాత్తూ ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులే ఉద్యోగాలకి ఎంపికయిన యువతకి అపాయింట్‌మెంట్ లెటర్స్ ఇస్తుండటం ప్రభుత్వాల ప్రాధాన్యాన్ని తెలియపరుస్తుంది. తెలంగాణాలో గతంలో డిఎస్సీ ఉద్యోగార్థులకు, రీసెంట్‌గా గ్రూప్ వన్ ఉద్యోగార్థులకు సి.ఎం. రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు ఇవ్వడం, ఆంధ్రప్రదేశ్‌లో అయితే డి.ఎస్సీకి ఎంపికయిన సుమారు పదహారు వేల ఉద్యోగార్థులకు నారా చంద్రబాబు నాయుడు నియామక పత్రాలు అందజేసారు. ఈ రెండు సంఘటనలు నిరుద్యోగ యువత పట్ల ప్రభుత్వాలు చూపిస్తున్న ఆసక్తిని తెలియజేస్తున్నాయి.**

ఉభయ తెలుగు రాష్ట్రాలలో గత ప్రభుత్వాలు ఇచ్చిన నోటిఫికేషన్స్ ప్రక్రియలను పూర్తి చేసే పనిలో ప్రస్తుత ప్రభుత్వాలున్నాయి. ఈ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. తెలంగాణలో తాజాగా గ్రూప్-2 నియామక పత్రాలు కూడా ఇవ్వడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అయితే 2018 గ్రూప్ వన్ కేసు కోర్టు పరిధిలో ఉంది. ఎంపికైనారు అని చెప్పబడుతున్న వారు ఆల్రెడీ ఉద్యోగాలలో ఉన్నారు. ఇక ఎ.పి. 2023 గ్రూప్-1, గ్రూప్-2 ఫలితాలను కోర్టు అనుమతి ఇచ్చే వరకు వెల్లడించరాదని స్పష్టమయింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో 2023 గ్రూప్‌వన్, గ్రూప్-2 ఉద్యోగార్థులు, ఇటు ఆయా జాబితాలో ఉన్నవారునూ, లేని వారునూ ఇరువురూ తీవ్ర ఉత్కంఠలో ఉన్నారు. ఇది క్లుప్తంగా ఉభయ తెలుగు రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎంపిక ప్రక్రియ దశలు.

తెలంగాణ గ్రూప్ వన్ ప్రక్రియ ఆది నుండి జటిలంగా తయారయి, చివరకు నియామక పత్రాలను ఎంపికయిన వారికి ప్రభుత్వం అందించింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో 2023 గ్రూప్-1,2లు కోర్టు అనుమతి కొరకు ఎదురుచూస్తున్నాయి. 2018 గ్రూప్ వన్ పై తీర్పు ఎలా వస్తుందో చూడాలి. ఇవన్నీ గమనిస్తున్న సగటు నిరుద్యోగి భయపడే పరిస్థితి. ఎందుకంటే కాలం, డబ్బు వెచ్చించి కష్టపడి చదివి, చివరకు నోటిఫికేషన్‌లు కోర్టు తలుపులు తడుతుంటే ఎవరిని నమ్మాలో, ఏమి నమ్మాలో తెలియని పరిస్థితి.

అయితే ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ ఫ్రెష్‌గా నోటిఫికేషన్లు వస్తాయని, వస్తే జాబ్ కేలండర్‌ల పరిస్థితి ఏమిటి? అనేది ఉద్యోగార్థులు ఎంతగానో ఆశతో ఉన్నారు. ఎట్టి పరిస్థితులలోనూ 2026 సంవత్సరానికి కేలండర్ ఇస్తామని, అందుకు సంబంధించిన రూట్ షెడ్యూల్‌ని, కసరత్తుని ప్రభుత్వం, జి.ఎడి మరియు ఏపీపీఎస్సీ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ ప్రయత్నాలను ఎ.పి.కి చెందిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు ముమ్మరంగానే చేస్తున్నారు. ఇందులో భాగంగానే కుదిరితే కేలండర్‌లో లేదా డిశెంబర్ 2025లోపలే గ్రూప్-1 150 పోస్టులతో ఫ్రెష్ నోటిఫికేషన్ ఇవ్వడానికి ఏపీపీఎస్సీ సమాయత్తం అవుతున్నట్లు తెలుస్తున్నది. అంతేకాదు, ఎ.పి. గ్రూప్-1లో ఇంతకు మునుపు ఉన్న ప్రిలిమ్స్‌లోని రెండు పేపర్లను ఒకటి చేయడం, అలానే మెయిన్స్‌లో వేర్వేరుగా ఉన్న క్వాలిఫై



తెలుగు, ఇంగ్లీష్ పేపర్లను కలిపి ఒకే పేపర్ పెట్టేయడం, ఇంతకన్నా మించి అత్యంత ప్రామాణికంగా రోస్టర్ పాయింట్లను రాబోతున్న పరీక్షలకి ముందే ప్రిపేర్ చేయడం... ఇలా ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రాబోయే నోటిఫికేషన్‌లను ఇవ్వాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది.

అలానే తెలంగాణా రాష్ట్రంలో 50 వేల ఉద్యోగాలను రాబోయే నోటిఫికేషన్‌లలో ప్రకటించాలని ఆందోళనలు, నిరాహారదీక్షలు జరుగుతున్నాయి. తెలంగాణలో కూడా నూతనంగా జాబ్ కేలండర్ ఇవ్వడానికి కదలికలు జరుగుతున్నాయి. ప్రస్తుతం గ్రూప్ వన్, గ్రూప్-2 నియామకాలు జరుగుతున్నందున ఇవి పూర్తి కాగానే నూతన నోటిఫికేషన్‌లపై తెలంగాణా ప్రభుత్వం ఖచ్చితంగా దృష్టి సారిస్తుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వాలు మళ్ళీ అధికారంలోకి రావాలని గట్టిగా అనుకుంటున్నాయి. కనుక నిరుద్యోగులకి ఎంతో కొన్ని వందల్లో నైనా ఉద్యోగాలకు వివిధ నోటిఫికేషన్లు ఇస్తారు. ఆశావా దానికి మనం ఖర్చు పెట్టాల్సిన డబ్బు ఏమీ ఉండదు కదా! నెగిటివిటికి ఆరోగ్యం చెడగొట్టుకొని, టెన్షన్ పడి, ఆసుపత్రులకు డబ్బులు కట్టవలసి వస్తుంది కదా!

మొన్న ఆంధ్రప్రదేశ్‌లో డి.ఎస్సీ., జాబులు సాధించిన వారు గత పదెనిమిది సంవత్సరాల నుండి చదువుతున్న వారే కావటం విశేషం. అలాగని డి.ఎస్సీ కొరకు వారు ఒకపక్క ఎదురుచూస్తూనే, మరోపక్క ఖాళీగా కూర్చోకుండా ఎంతో కొంత జీతానికి ప్రయివేటు స్కూల్సులో పాఠాలు చెప్పిన వారే.. గమనించండి. ఇపుడున్న పరిస్థితుల్లో జన్మకో శివరాత్రి అన్నట్లు, పుష్కరానికి పన్నెండేళ్ళు అన్నట్లు గట్టిగా ఓ రెండుసార్లు పోటీ పరీక్ష రాసుకునే ఛాన్స్ వస్తుంది. ఈలోగా వయసు అయిపోతుంది. ఒకవేళ పాలిత ప్రభుత్వాలు దయతలచి పరీక్షలు రాసుకునే ఏజ్‌ని పెంచితే గనక మరో ఛాన్స్ వస్తుంది. అంతే! అందుకని మొదటి ప్రయత్నమే గట్టిగా చేయాలి. మరోసారి మరో నోటిఫికేషన్ వచ్చేనాటికి మన పరిస్థితులు మారిపోతున్నాయి. పెళ్ళిళ్ళు అవుతాయి లేదా ప్లాన్ బికి వెళ్ళిపోయి ఉంటాం లేదా ఏదో ఒక చిన్నపాటి ఉద్యోగం చేసుకుంటూ సబ్జెక్టుని మరచి పోయి ఉంటాము. ఎందుకంటే మనం ఎల్లకాలం పోటీ పరీక్షల ప్రిపరేషన్‌లో ఉండలేము కదా!

ప్రభుత్వాలు కూడా నిరుద్యోగుల పట్ల దయ తలచాలి. తాము గెలవడానికి నిరుద్యోగులు గట్టిగా భుజం కాస్తారు. తరువాత ఆ నిరుద్యోగులకే జాబ్ నోటిఫికేషన్‌లు ఇవ్వడానికి ప్రభుత్వాలు మీన మేషాలు లెక్కిస్తుంటాయి. ఒక నిరుద్యోగి పడే వేదన మానసికంగా అంతా ఇంతా కాదు. కళ్ళల్లో వత్తులు వేసుకొని నోటిఫికేషన్‌ల కొరకు సంవత్సరాల తరబడి ఎదురు చూడడం, అనంతరం కళ్ళు కాయలు కాసేలా, కళ్ళల్లో నీరింకిపోయేలా చదవటం చేస్తారు. జాబ్ వస్తే జీవితంలో స్థిరపడి అమ్మానాన్నలను మంచిగా చూసుకోవచ్చున్న స్వార్థం తప్ప ఒక నిరుద్యోగికి ఇంకేముంటుంది. రేపు జాబ్ సాధించిన తరువాత ఇఎమ్ఐలో లోనుతీసి ఒక ఇల్లు కట్టుకుంటారు. అంటే నేటి పెన్షన్‌లు లేని జాబ్‌లో ఎన్నాళ్ళు చేసుకుంటే అన్నాళ్ళు జాబ్. ప్రభుత్వాలు జీతాలతో పాటు ఇచ్చే డి.ఏ.లు, ఎరియర్‌లు లాంటివి వాటికి ఇష్టం ఉంటే ఇస్తాయి..లేకపోతే నానబెడతాయి. అందుకనే అంటాను...ప్రభుత్వాలు ఉచిత పథకాలపై పెట్టే ఖర్చు తగ్గించుకొని, పథకాలను తగ్గించుకొని నిరుద్యోగుల కళ్ళల్లో సంతోషం నింపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ గత ప్రభుత్వాలు ఉచిత పథకాలను చాలానే ఇచ్చాయి. కాని అవి ఓడిపోయాయి. కనుక ఉచిత పథకాల ద్వారా ఓట్లు రావు అన్నది ప్రస్తుత ప్రభుత్వాలు గ్రహించగలగాలి. సంక్షేమం అవసరమే. పేదరికపు రేఖకి దిగువున ఉన్నవారిని ప్రభుత్వాలు ఆదుకోవలసినదే. సంక్షేమం చేయవలసినదే. కాని యువతను రెండో లేదా మూడో ప్రిఫరెన్స్‌గా పెట్టుకుంటే యువత పెడదారిన పడే అవకాశం ఉంది. యువత విలువైన మానవ వనరు. దానిని పాలనలోకి తీసుకొని యువత ఆలో చనలకి పదును పెట్టాలి. లేకపోతే యువత నిర్వీర్యం అవుతుంది.



హిస్టరీ రఫీసార్
అసిస్టెంట్ ప్రొఫెసర్
సెల్: 9848827238

APPSC,TGPSC, DSC, SSC, RRB, POLICE and Other Competitive Exams

## కరెంట్ అఫైర్స్

September 2025

**1. మహిళలను ఆర్థికంగా శక్తివంతం చేయడానికి ముఖ్యమంత్రి మహిళా ఉపాధి పథకాన్ని ఏ రాష్ట్రంలో ప్రారంభించారు?**
1. మధ్యప్రదేశ్ 2. రాజస్థాన్
3. బీహార్ 4. ఉత్తర ప్రదేశ్

**2. డ్రోన్లు మరియు యాంటీ-డ్రోన్ వ్యవస్థలపై దృష్టి సారించి ఏ దేశం తన అతిపెద్ద ఉమ్మడి సైనిక వ్యాయామం 'కోల్డ్ స్టార్ట్' నిర్వహించబోతోంది?**
1. యునైటెడ్ స్టేట్స్ 2. రష్యా
3. చైనా 4. భారతదేశం

**3. ప్రపంచంలో మొట్టమొదటి AI-జనరేటెడ్ జీనోమ్ను సృష్టించిన స్టాన్ఫోర్డ్ మరియు ఆర్క్ ఇన్స్టిట్యూట్ ఏ దేశంలో ఉన్నాయి?**
1. అమెరికా 2. కెనడా
3. జర్మనీ 4. చైనా

**4. ఇటీవల 'అహల్యానగర్'గా పేరు మార్చబడిన అహ్మద్నగర్ రైల్వే స్టేషన్ ఏ రాష్ట్రంలో ఉంది?**
1. గుజరాత్ 2. మహారాష్ట్ర
3. మధ్యప్రదేశ్ 4. రాజస్థాన్

**5. 2028 ప్రపంచ జూనియర్ షూటింగ్ ఛాంపియన్షిప్‌ను ఎవరు నిర్వహిస్తారు?**
1. ఆస్ట్రేలియా 2. చైనా
3. భారతదేశం 4. యుఎస్ఎ

**6. జితేంద్ర పాల్ సింగ్ ఇటీవల ఏ దేశానికి భారతదేశ కొత్త రాయబారిగా నియమితులయ్యారు?**
1. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా
2. ఇజ్రాయెల్ 3. ఫ్రాన్స్ 4. జర్మనీ

**7. ప్రపంచంలోనే అతిపెద్ద డేటా సెంటర్ను ఈ క్రింది ఏ రాష్ట్రంలో నిర్మిస్తారు?**
1. గుజరాత్ 2. ఒడిశా
3. మహారాష్ట్ర 4. ఉత్తర ప్రదేశ్

**8. T-20 అంతర్జాతీయ క్రికెట్లో 100 వికెట్లు తీసిన తొలి భారతీయుడు ఎవరు?**
1. జస్ప్రీత్ బుమ్రా 2. యుజ్వేంద్ర చాహల్
3. భువనేశ్వర్ కుమార్ 4. అర్ష్దీప్ సింగ్

**9. ఆత్మనిర్భర్ భారత్ చొరవ కింద భారతదేశం ఆఫ్రికాలో తన మొదటి రక్షణ తయారీ కర్మాగారాన్ని ఏ దేశంలో ప్రారంభిస్తుంది?**
1. మొరాకో 2. కెన్యా
3. నైజీరియా 4. ఘనా

**10. సెప్టెంబర్ 17వ తేదీని సంతాప దినంగా ప్రకటించిన దేశం ఏది?**
1. భారతదేశం 2. నేపాల్
3. పాకిస్తాన్ 4. బంగ్లాదేశ్

**11. ఉజ్బెకిస్తాన్లో జరిగిన గ్రాండ్ స్విస్ చెస్ టోర్నమెంట్ 2025 ను గెలుచుకున్న ఆటగాడు ఎవరు?**
1. వైశాలి రమేష్బాబు 2. విదిత్ గుజరాతీ
3. అనీష్ గిరి 4. మాగ్నస్ కార్ల్సెన్

**12. పసిఫిక్ రీచ్ 2025 (XPR- 25) సైనిక వ్యాయామం ఏ దేశంలో ప్రారంభించబడింది?**
1. సింగపూర్ 2. మలేషియా
3. ఫిలిప్పీన్స్ 4. ఆస్ట్రేలియా

**13. ఇటీవల, మారిషస్ కోసం భారతదేశం ఎన్ని మిలియన్ డాలర్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది?**
1. 680 మిలియన్ డాలర్లు
2. 685 మిలియన్ డాలర్లు
3. 690 మిలియన్ డాలర్లు
4. 695 మిలియన్ డాలర్లు

**14. ఇటీవల, ఏ దేశానికి చెందిన మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీలా కర్కి ఆ దేశ కొత్త ప్రధానమంత్రిగా నియమితులయ్యారు?**
1. భారతదేశం 2. నేపాల్
3. భూటాన్ 4. శ్రీలంక

**15. ఏ సంవత్సరం నాటికి భారతదేశం నికర-సున్నా ఉద్గారాలను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది?**
1. 2040 2. 2050 3. 2070 4. 2060

**జవాబులు :** 1)3 2)4 3)1 4)2 5)1 6)2 7)1 8)4 9)1 10)2 11)1 12)1 13)1 14)2 15)3



N.Jagadeesh,
Content Writer
V. J. Study Circle

## మండల ఎంఈఎఫ్ నూతన కమిటీ ఎన్నిక




**బ్రహ్మంగారిమఠం, మేజర్‌న్యూస్ :** బ్రహ్మంగారిమఠం మండలంలోని మాదిగ ఉద్యోగ సంఘాల ఎంఈఎఫ్ నూతన కార్యవర్గ కమిటీని ఆదివారం స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల లో ఎంఈఎఫ్ జిల్లా నాయకులు ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అతిథులుగా హాజరైన రాష్ట్ర ఎం ఈ ఎఫ్ నాయకులు ఈరి జోనస్ మైదుకూరు నియోజకవర్గం ఎం ఈ ఎఫ్ అధ్యక్షులు లక్కినేని బాబు జిల్లా ఉపాధ్యక్షులు హరినాథ్ హాజరు కాగా వారి సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మండల ఎంఇఎఫ్ అధ్యక్షులుగా కొడవటి కంటి గురవయ్య, మండల కార్యదర్శిగా సోమిరెడ్డి పల్లె ఓబయ్య, కోశాధికారిగా ముండ్లపాటి చంద్రశేఖర్ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్య అతిథులు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ జోనస్ మాట్లాడుతూ దళిత ఉద్యోగుల పట్ల వేధింపులు పని భారము తగ్గించాలని తగ్గించాలని అధిక శాతం దళిత ఉద్యోగుల పట్ల వివక్ష చూపుతూ వేధింపులకు గురిచేస్తున్నారని ఓటమి ప్రభుత్వం దళితుల పట్ల వివక్షత లేకుండా అందర్నీ సమభావంతో చూడాలని ప్రత్యేకంగా మాదిగ ఉద్యోగులు ఐక్యమత్యంగా ఉంటూ జాతి లక్ష్యాలను వర్గీకరణ ఫలాలను మాదిగ జాతి బిడ్డలకు అందించాలని కోరారు ఈనెల 15వ తేదీన కడప జిల్లాలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సభను ప్రతి మాదిగ ఉద్యోగ పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గం సత్యాల బాలసుబ్బయ్య బాలాజీ మన్నేపల్లి గోపాల్ సురేష్ రామకృష్ణ బ్రహ్మంగారిమఠం ఎమ్మార్పీఎస్ నాయకులు ఎంఇఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శివారెడ్డికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం



**వేంపల్లె, మేజర్‌న్యూస్:** స్థానిక ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలలో గత 33 ఏళ్లుగా గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కల్లూరు శివారెడ్డికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. కడప జిల్లా గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం (కృష్మ) ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి దుశ్శాలువ కప్పి జ్ఞాపికను అందజేశారు. పురస్కారం లభించడంపై కరస్పాం డెంట్ రమణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు గుజ్జుల కృష్ణా రెడ్డి, కృష్మ జిల్లా అధ్యక్షుడు బివిస్ రమణారెడ్డి, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, మదన్మోహన్ రెడ్డి, చార్లెస్ పాల్గొన్నారు.

## అనాధవృద్ధులకు అన్నదానం



**వేంపల్లె, మేజర్‌న్యూస్:** స్థానిక పాతగండి రోడ్డులోని మధర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో అనాధవృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఆదివారం శింగారెడ్డి వీరమ్మ ప్రథమ వర్థంతి సందర్భంగా కుటుంబ సభ్యులు అన్నదానం, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. తమ తల్లి జ్ఞాపకార్థం అనాధవృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అలాగే శింగారెడ్డి రెడ్డన్న వర్ధంతిని కూడా గత 16 ఏళ్ల నుంచి అనాధల మధ్య నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆశ్రమ అభివృద్ధికి చేయూత అందిస్తామన్నారు. కుటుంబ సభ్యులు ఓబులమ్మ, సార్థక్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రూప, ధర్మారెడ్డి, సౌజన్య, చేతవ్, సింహారెడ్డి, మౌక్తికా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ మద్యం కేసులో అసలు నేరస్థులెవరో తెలపాలి

### వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి




**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** ములకల చెరువు నకిలీ మద్యం కేసులో అసలు నేరస్థులెవరో తెలపాలని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఎక్సైజ్ అధికారులను ప్రశ్నించారు. ఆదివారం స్థానిక దొరసానిపల్లెలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం లో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ములకల చెరువులో నకిలీ మద్యం తయారు చేసే ఫ్యాక్టరీని, ముఠాను ఎక్సైజ్ అధికారులు కనుగొన్నారని, కాగా గత 15 నెలలుగా వారు ఈ తయారీ ఎందుకు కనుగొనలేదని ప్రశ్నించారు. నకిలీ మద్యం తయారీలో కూటమి ప్రభుత్వ నాయకుల అండదండలు వున్నాయని, అదే విధంగా రాష్ట్రంలోని చాలా మద్యం దుకాణాలకు చేర వేశారని విమర్శించారు. కేవలం మొలకలచెరువు నకిలీ మద్యం తయారీ కేంద్రం లో పనిచేసే కూలీలపై కూటమి ప్రభుత్వం కేసులు నమోదు చేసిందే తప్ప అసలు దోషులను బట్టబయలు చేయలేదని తెలిపారు. ఎన్ బ్రాండ్ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యం తయారు చేసి నేరుగా బెల్టు షాపులకు సరఫరా చేస్తున్నారని అక్కడి నుండి విక్రయాలు జరిపి ప్రజల ప్రాణాలకు ముప్పు తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ బ్రాండ్ పేరుతో తయారవుతున్న మద్యాన్ని ఎవరు సేవించవద్దని రాష్ట్ర ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. గత ఎన్నికలకు ముందు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు నాణ్యమైన మద్యం అందిస్తాననీ ప్రజలకు మోసపూరితమైన వాగ్దానాలు చేసి నేడు చేస్తున్నది ఏంటని ప్రశ్నించారు. గత వైసిపి పాలనలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన మద్యాన్ని అందించిందన్నారు. మొలకల చెరువు లో అదుపులోకి తీసుకున్న మద్యం ఫ్యాక్టరీ పై అక్షరమే సమగ్ర విచారణ జరిపి అసలు దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవేళ కూటమి ప్రభుత్వంలో సమగ్ర విచారణ జరపకపోతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన డిజిటల్ బుక్‌లో నమోదు చేసి రాబోయే వైసిపి ప్రభుత్వంలో సమగ్ర విచారణ జరిపే అసలు దోచులను శిక్షిస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం వైసిపి ఏర్పాటు చేసిన డిజిటల్ బుక్కులో మొలకలచెరువు నకిలీ మద్యం ఉదంతాన్ని ఆయన నమోదు చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు కౌన్సిలర్ లు వరికుంటి ఓబులరెడ్డి రాగుల శాంతి గుర్రం లావణ్య మన్నె సత్యం వైసీపీ మండల బీసీ సెల్ ఉపాధ్యక్షులు నల్లదేసి జంగమయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** రోటరీ క్లబ్ మరియు రోటరీ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో రోటరీ కంటి ఆసుపత్రి సభా భవనం నందు ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ శ్యామ్ సుందర్ రెడ్డి ఎస్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తపల్లి శీను రోటరీ పాస్ట్ డిస్టిక్ గవర్నర్ సాధు గోపాల కృష్ణ రోటరీ కంటి ఆసుపత్రి అధ్యక్షులు కోటా శివకుమార్ లు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని భావి సమాజ నిర్మాతలను తరగతిగది నాలుగు గోడల మధ్య తయారు చేసే గొప్ప సేవ అని అటువంటి ఉపాధ్యాయులుగా సమాజ హితులుగా విశిష్ట సేవలు అందించిన తుమ్మల ఈశ్వర్ రెడ్డి దొంతు మురళీకృష్ణ ఎల్ చంద్ర ఓబుల రెడ్డి రోటరీ క్లబ్ రోటరీ కంటి ఆసుపత్రి సంయుక్తంగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేసి గౌరవించడం సత్సంప్రదాయంగా భావిస్తున్నామని అంతర్జాతీయ సేవా సంస్థ అయిన రోటరీ క్లబ్ నందు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని రొటీరియన్స్ అందరినీ అభినందించారు క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర రెడ్డి సెక్రటరీ షేక్ బాబా ట్రెజరర్ దొంతు బాలాజీలు మాట్లాడుతూ సద్గురువులను సగౌరవంగా సత్కరించడం చాలా ఆనందదాయకం అన్నారు. గురు కులానికి అందరకు స్ఫూర్తిదాయ కమని తెలియజేశారు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలు తుమ్మల ఈశ్వర్ రెడ్డి దొంతు మురళీకృష్ణ ఎల్ చంద్ర ఓబులరెడ్డి లు మాట్లాడుతూ విద్యారంగానికి సంబంధించిన అధికారులు ప్రభుత్వాల చేత పొందే అవార్డుల కంటే అంతర్జాతీయ సేవా సంస్థ అయిన రోటరీ క్లబ్ ద్వారా ఈ పురస్కారాలను స్వీకరించడం తాము మరువలేమని తమ బాధ్యతను మరింత పెంచారని ఈ సన్మానము గురువులందరికి జరిగిన సన్మానంగా భావిస్తున్నామని సమాజానికి మరిన్ని సేవలు అందించేందుకు మాలో స్ఫూర్తిని నింపారని తెలియజేశారు. మాస్టర్ ఆఫ్ శర్మని బేపారి జాకీర్ అహ్మద్ దొంతు బాలాజీలు అసిస్టెంట్ గవర్నర్ కే మల్లికార్జున పాస్ట్ ప్రెసిడెంట్ అయూబ్ ఖాన్ డాక్టర్ రాజా రామ్మోహన్ రెడ్డి జాయింట్ సెక్రెటరీ ఖాదర్బాషా మిడ్ టౌన్ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఉట్టి తిరుపతయ్య ఎస్టియు ఏపీటీఎఫ్ సంఘాల నాయకులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పురస్కార గ్రహీతల కుటుంబ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పులివెందుల మార్కెట్ యార్డ్ నూతన పాలకవర్గానికి అభినందనలు తెలిపిన బీటెక్ రవి





**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన గడ్డం అమర్నాథ్ యాదవ్, వైస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కల్లూరు చంద్రవర్ధన్ రెడ్డి మరియు మార్కెట్ యార్డ్ డైరెక్టర్లకు పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బిటెక్ రవి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ-నామ్ ఈ నామ్ వ్యవస్థ:లి రేపటి నుండి పులివెందుల మార్కెట్‌లో ఈ-నామ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నారు. దీని ద్వారా దేశంలోని అన్ని మార్కెట్ల ధరలు డిజిటల్ స్క్రీన్‌లో కనిపిస్తాయి. వ్యాపారస్థులు ఆన్‌లైన్‌లో పంటను కొనుగోలు చేయవచ్చు. దీని వల్ల రైతులకు, వ్యాపారులకు దళారీ వ్యవస్థ అనేది ఉండదు.నెంబర్ వన్ మార్కెట్ యార్డ్: పులివెందుల మార్కెట్ యార్డ్‌ను రాష్ట్రంలోనే నెంబర్ వన్ మార్కెట్‌గా తీర్చిదిద్దుతామని, రైతులకు అన్ని విధాలా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ పథకాలు: గత వైసీపీ ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయలేదని, డ్రిప్ పరికరాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 90% సబ్సిడీతో అప్లై చేసిన పది రోజుల్లోనే డ్రిప్ పరికరాలను రైతులకు ఇస్తుందని రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉందని అన్నదాత సుఖీభవ,పీఎం కిసాన్ వంటి పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు.సూపర్ సిక్స్ పథకాల అమలు: సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నామని, ఇది సూపర్ హిట్ అయిందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పులివెందుల నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారని, నవంబర్ లేదా డిసెంబర్‌లో ఆయన పులివెందులకు వస్తారని తెలియజేశారు. గతంలో 'నీరు-చెట్టు' ద్వారా కార్యకర్తలకు అండగా నిలిచారని, ఇప్పుడు కూడా దానికన్నా మెరుగైన పథకాలను కార్యకర్తల కోసం తీసుకువచ్చేందుకు సీఎం చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేశారని పేర్కొన్నారు.